

పట్టణాలకు దీటుగా..
పట్టణాలకు దీటుగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు.
- 8లో ▸



పట్టు పట్టి.. కొలువు కొట్టి..
కష్టపడి చదివారు. ఇష్టంతో సాధన చేశారు. దీంతో వారిని పోలీసు కానిస్టేబుల్ కొలువులు వరించాయి.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.8 /18.6
ఉదయం చలిగాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఓపెన్ డిగ్రీ ప్రవేశాల గడువు పొడిగింపు

కామారెడ్డి అర్బన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరం కోర్సుల్లో ప్రవేశాల గడువును ఈనెల 20 వరకు పొడిగించారు. ఈ విషయాన్ని వర్సిటీ కామారెడ్డి స్టడీ సెంటర్ సమన్వయకర్త రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ నిర్వహించిన ప్రవేశ పరీక్ష లేదా ఇంటర్ తత్సమాన పరీక్షలలో పాసైన వారు ఓపెన్ డిగ్రీ కోర్సుల్లో చేరడానికి అర్హులని పేర్కొన్నారు. వర్సిటీలో రెండో, మూడో సంవత్సరం కోర్సుల విద్యార్థులు ఈనెల 20 తేదీ వరకు ఫీజు చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.

జిల్లా ఆస్పత్రికి ఎస్‌డీపీ యంత్రం



కామారెడ్డి టౌన్: జిల్లా ఆస్పత్రికి అత్యాధునిక సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ యంత్రం వచ్చిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి గురువారం తెలిపారు. ఈ యంత్రం దాతల నుంచి రక్త ఫలికలను మాత్రమే తీసుకుని మళ్లీ యథావిధిగా వారి శరీరంలోకి రక్తాన్ని పంపిస్తుందన్నారు. ఇంకా యంత్రాన్ని అమర్చాల్సి ఉందన్నారు. యంత్రాన్ని ఆర్ఎంలో శ్రీనివాస్ పరిశీలించారు.

నేడు కేసీఆర్ అల్పాహార పథకం ప్రారంభం

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం సర్కారు ప్రవేశపెట్టిన కేసీఆర్ అల్పాహారం పథకాన్ని శుక్రవారం ప్రారంభించనున్నారు. జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఉదయం 8.30 గంటలకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పథకాన్ని ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ దేవేందర్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

'ఆయిల్‌పాంపై అవగాహన కల్పించాలి'



కామారెడ్డి క్రైం: ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఏఈవోలను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయిల్‌పాం సాగు లక్ష్యాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్‌పాంలో అంతర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఈ పంట సాగుచేసిన రైతు క్షేత్రాన్ని ఇతర రైతులు క్షేత్ర పర్యటన చేసేలా చూడాలన్నారు. వరి, మొక్కజొన్న, పత్తి లాంటి పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పాం సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలో 8,100 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సమావేశంలో డీఏవో భాగ్యలక్ష్మి, జిల్లా ఉద్యాన వనాధికారి విజయ భాస్కర్, ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లుగా ఎంపిక

కామారెడ్డి క్రైం: జిల్లాకు చెందిన పలువురు కానిస్టేబుల్ కొలువులు సాధించారు. 152 మంది సివిల్, 145 మంది టీఎస్ఎస్పీ, 85 మంది ఏఆర్, 19 అగ్నిమాపక, ఇద్దరు జైళ్ల శాఖలకు సంబంధించిన కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. మద్నూర్ మండలంలోని శేఖాపూర్ గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ముళ్లకు పోలీస్ ఉద్యోగం రావడం గమనార్హం. జిల్లాకు చెందిన దాదాపు అన్ని ప్రాంతాల నుంచి కానిస్టేబుళ్లుగా ఎంపిక కావడంపై పోలీస్ ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాగిరెడ్డిపేటకు ఇంటర్ కళాశాల మంజూరు



నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైందని జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలో గురువారం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే సురేందర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కళాశాల మంజూరుతో మండలంలోని విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్ రెడ్డి, మండలాధ్యక్షుడు సిద్ధయ్య, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.

దారి మళ్లుతున్న ధాన్యం



ప్రభుత్వం రైతుల వద్ద నుంచి సేకరించి కస్టం మిల్లింగ్ కోసం మిల్లులకు పంపిన ధాన్యం దారి మళ్లుతోంది. మిల్లర్లు వడ్లను మార్కెట్‌లో అక్రమంగా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు సైతం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో మిల్లర్ల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. సీఎంఆర్ లక్ష్యమేమో కొండలా అలాగే ఉండిపోతోంది.

– సాక్షి, కామారెడ్డి

- లారీలకు లారీలు పక్కదారి..
- ఇష్టారాజ్యంగా మిల్లర్ల వ్యవహారం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- లక్ష్యానికి దూరంగా సీఎంఆర్

జిల్లాలో సీఎంఆర్‌కు సంబంధించిన వివరాలు.. (మెట్రిక్ టన్నుల్లో)

సీజన్	మిల్లులకు ఇచ్చినది	డెలివరీ చేసినది	మిల్లర్ల వద్ద నిల్వ	డెలివరీ శాతం
ఖరీఫ్	4,73,871.780	1,27,557.453	1,89,936.639	40
యాసంగి	3,64,972.520	18,535.230	2,27,818.221	08

జిల్లాలో గత ఖరీఫ్ సీజన్‌లో కస్టం మిల్లింగ్ కోసం ప్రభుత్వం 4.73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు అప్పగించింది. ఇందులో ఇప్పటివరకు 1.27 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే తిరిగివచ్చింది. ఇంకా 1.89 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. ఇంకా మిల్లర్ల వద్దే 60 శాతం ధాన్యం ఉందన్నమాట.. అలాగే యాసంగి సీజన్‌లో 3.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు ఇవ్వగా.. 18, 535 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే డెలివరీ చేశారు. ఇంకా 2.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్ల దగ్గరే ఉంది. రెండు సీజన్లలో కలిపి 4.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్ల వద్దే ఉండిపోయింది. ఎప్పటికప్పుడు మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి అందించాల్సి ఉండగా, మిల్లర్లు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యంతో దందా నడిపిస్తున్నారు. అయినా పట్టించుకునేవారు కరువయ్యారు.

అడిగినప్పుడు చూద్దామనే ధోరణిలో..

సీఎంఆర్ కోసం అధికారుల నుంచి ఒత్తిడి వచ్చినప్పుడు చూద్దామనే ధోరణితో కొందరు మిల్లర్లున్నారు. రాజకీయ అండదండలు ఉండడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సీఎంఆర్ విషయంలో అధికారులు కూడా ఒత్తిడి చేయడం లేదు. సీఎంఆర్‌కు సంబంధించిన ధాన్యం పక్కదారి పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విస్మయానికి గురి చేస్తోంది.

రేషన్ బియ్యం సేకరించి!

వడ్లను అమ్ముకుంటున్న మిల్లర్లు కొందరు.. సీఎంఆర్ కోసం రేషన్ బియ్యం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. రేషన్ బియ్యమే అటూ ఇటూ తిరిగి దళారుల ద్వారా తిరిగి రైస్ మిల్లలకు చేరుతోందని, మిల్లర్లు దానిని తిరిగి బస్తాల్లో నింపి ప్రభుత్వానికి అప్పగిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఈ విషయమై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఖాళీ అవుతున్న గోదాములు

రైస్ మిల్లుల్లోని గోదాముల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని మిల్లర్లు యథేచ్ఛగా అమ్ముకుంటున్నారు. నిత్యం లారీలకు లారీల ధాన్యం ఇతర ప్రాంతాలకు తరలిపోతోంది. వడ్లను కామారెడ్డి నుంచి నల్గొండ, సూర్యాపేట జిల్లాలకు తరలిస్తున్నట్టు తెలుస్తోంది. జిల్లాలోని కొన్ని మిల్లుల నుంచి పెద్ద మొత్తంలో ధాన్యం తరలిపోతోంది. దీంతో మిల్లులు, గోదాములు ఖాళీ అవుతున్నాయి. ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యాన్ని ఇవ్వాల్సిన మిల్లర్లు కొందరు మార్కెట్‌లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వడ్లను అక్రమంగా తరలిస్తున్నా.. అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో ధాన్యం పక్కదారి పట్టిస్తున్న మిల్లర్లు అధికారులను కూడా మేనేజ్ చేసుకున్నారన్న ప్రచారం జరుగుతోంది.

'మిల్లింగ్ లక్ష్యాలను పూర్తి చేయాలి'



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి క్రైం: రైస్ మిల్లుల యజమానులు ఈనెలాఖరులోగా మిల్లింగ్ లక్ష్యాలను పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం రైస్‌మిల్లుల యజమానులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 శాతంకన్నా తక్కువగా లక్ష్యాన్ని పూర్తి చేసిన రైస్‌మిల్లుల యజమానులు ధాన్యం మిల్లింగ్‌ను వేగవంతం చేయాలన్నారు. 50 శాతం లక్ష్యం దాటని వారికి వచ్చే ఖరీఫ్ సీజన్ ధాన్యాన్ని పంపబోమని పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, సివిల్ సప్లయ్ డీఎం అభిషేక్ సింగ్, డిప్యూటీ తహసీల్దార్లు, అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతలకే దళితబంధు



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న పెద్దమల్లారెడ్డి గ్రామ దళితులు

- పెద్దమల్లారెడ్డి గ్రామ దళితుల ఆరోపణ
- అర్హులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన
- కలెక్టరేట్ వద్ద ఆందోళన

కామారెడ్డి క్రైం: అధికార పార్టీ నాయకులు, వారి అనుచరులకే దళిత బంధు ఇస్తున్నారని భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన దళితులు ఆరోపించారు. గ్రామానికి చెందిన సుమారు 80 మంది దళితులు గురువారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌లోనికి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీలు దళితబంధు తీసుకోవడంతో పాటు వారి అనుచరులు, బంధువులకు ఇప్పించుకున్నారన్నారు. గ్రామంలో 500 దళిత కుటుంబాలు ఉన్నాయని 15 మందికే పథకం లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. లబ్ధిపొందినవారిలో ఒక్కరు కూడా అర్హులు లేరన్నారు. ఇతర పార్టీల వారికి ఇవ్వబోమని బహిరంగంగానే చెబుతున్నారన్నారు. అధికారులు స్పందించి విచారణ జరిపించి, అర్హులకే దళితబంధు వచ్చేలా చూడాలని కోరారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం



విద్యుదుత్పత్తి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

- ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

నిజాంసాగర్: రాష్ట్ర మంతటా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతోందని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. గురువారం నిజాంసాగర్ ప్రాజెక్టు అనుసంధానంగా ఉన్న హెడ్‌స్లూయిస్ జల విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రూ. 12 కోట్లతో చేపట్టిన జల విద్యుదుత్పత్తి కేంద్రం ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మన రాష్ట్ర తలసరి విద్యుత్ వినియోగం 2,140 యూనిట్లు కాగా.. ఆల్ ఇండియా సగటు 1,255 యూనిట్లు మాత్రమేనన్నారు. రాష్ట్రంలో ఎన్ని పరిశ్రమలు వచ్చినా వాటికి అవసరమైన నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. నాలుగేళ్ల నుంచి వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో రాష్ట్రంలో మొట్టమొదటి హైడల్ విద్యుత్ కేంద్రమైన నిజాంసాగర్‌లో జల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందన్నారు. హెడ్‌స్లూయిస్ జల విద్యుదుత్పత్తి కేంద్రంలోని 2 టర్బయిన్ల ఆధునికీకరణ పనులు సకాలంలో పూర్తి చేసి పూర్తిస్థాయిలో జల విద్యుత్ ఉత్పత్తి చేస్తామన్నారు. విద్యుత్తు కేంద్రంలో స్థలం ఉండడంతో మరో టర్బయిన్‌ను కొత్తగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ రమేష్‌బాబు, హైడల్ డైరెక్టర్ వెంకటరాజం, పోచంపాడ్ ఎస్ఈలు శ్రీనివాసులు, వెంకట్‌వర్మ, డీఈ శ్రీనివాస్, నిజాంసాగర్ జెన్‌కో ఏడీలు రవికుమార్, శ్రీకాంత్ ట్రాన్స్‌కో ఏడీ రామకృష్ణ, డీఈ కామేశ్వర్, ఏడీఈ మంజుల, ఏఈలు సురేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీ నేతల దూకుడు

- నియోజకవర్గాలలో విస్తృతంగా పర్యటిస్తున్న ఎమ్మెల్యేలు
- సుడిగాలి పర్యటనలు చేస్తున్న మంత్రులు
- నేడు బిచ్కుంద మండలకేంద్రానికి రానున్న హరీశ్‌రావు
- రేపు జిల్లాలో మరోసారి పర్యటించనున్న కేటీఆర్



సాక్షి, కామారెడ్డి: ఎన్నికల షెడ్యూల్ రాకముందే అధికార బీఆర్ఎస్ దూకుడు పెంచింది. ఎమ్మెల్యేలు అన్ని నియోజకవర్గాల్లో వరుస కార్యక్రమాలతో దూసుకుపోతున్నారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేస్తున్నారు. పనిలో పనిగా ఇతర పార్టీలకు చెందిన నాయకులను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. తమ నియోజకవర్గాలలో విస్తృతంగా పర్యటిస్తున్న ఎమ్మెల్యేలకు పార్టీ కీలక నేతలైన మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తోడయ్యారు. మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్, మరో ముఖ్య నాయకుడు, ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావులు అన్ని జిల్లాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. అందులో భాగంగా కామారెడ్డి జిల్లాలోనూ ఇరువురు పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బాన్సువాడ పట్టణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. బహిరంగ సభలో మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. ఇదే సమయంలో ప్రతిపక్ష పార్టీలపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్లు కూడా రాకుండా చూడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద మండల కేంద్రంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు రానున్నారు. అక్కడ ఏర్పాటు చేసే బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారు. ఈ నేపథ్యంలో జుక్కల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి భారీ సంఖ్యలో జనాన్ని సమీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు.

కామారెడ్డిలో కేటీఆర్ సభ

మున్సిపల్ ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ శనివారం కామారెడ్డిలో పర్యటించనున్నారు. జిల్లా కేంద్రంలోని డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించే సమావేశంలో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా పది వేల మందితో సభ నిర్వహించాలని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. ఇక్కడి నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేయనున్న నేపథ్యంలో నియోజకవర్గంలో పార్టీకి మరింత ఊపు తీసుకురావడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది.

కేటీఆర్ సభ ఏర్పాట్ల పరిశీలన

కామారెడ్డి టౌన్: మంత్రి కేటీఆర్ శనివారం జిల్లాకేంద్రంలో పర్యటించనున్న నేపథ్యంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. పార్టీ నాయకులతో మాట్లాడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బహిరంగ సభ ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, నాయకులు జూకంటి ప్రభాకర్, గడ్డం చందు, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న గంప గోవర్ధన్

నెరవేరిన వంద పడకల ఆస్పత్రి కల

- నేడు ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

బిచ్కుంద: మారుమూలనున్న జుక్కల్ నియోజకవర్గ ప్రజలకు వైద్య సేవలను మెరుగుపరిచేందుకు సర్కారు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బిచ్కుందలోని 30 పడకల సీహెచ్‌సీ స్థాయిని వంద పడకలకు పెంచింది. ఆస్పత్రిలో వసతుల కల్పన కోసం రూ.26 కోట్లు మంజూరు చేసింది. వంద పడకల ఆస్పత్రిని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు శుక్రవారం ప్రారంభించనున్నారు.

ఒక్క వైద్యుడూ లేక..

బిచ్కుంద సీహెచ్‌సీలో 30 పడకలు ఉన్నా ఒక్క రెగ్యులర్ వైద్యుడూ లేకపోవడంతో రోగులకు సరైన సేవలు అందడం లేదు. బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి చెందిన ఒక వైద్యుడు డిప్యుటేషన్‌పై వారంలో మూడు రోజులు మాత్రమే బిచ్కుంద ఆస్పత్రిలో అందుబాటులో ఉంటున్నారు. వారం రోజుల నుంచి ఆ వైద్యుడూ రావడం లేదు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో వైద్యం కోసం రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సర్కారు దవాఖానాలో వైద్యం అందకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంది. కొందరు వైద్యం కోసం పొరుగున ఉన్న మహారాష్ట్రలోని దెగ్లూర్, నాందేడ్‌తోపాటు బాన్సువాడ, నిజామాబాద్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఆస్పత్రిలో వైద్యుల పోస్టులు భర్తీ చేయాలని, ఆస్పత్రి స్థాయి పెంచాలని ప్రజలు ఏళ్లుగా కోరుతూ వస్తున్నారు. ఎట్టకేలకు సర్కారు వారి కోరిక నెరవేర్చింది. ప్రభుత్వం బిచ్కుంద ఆస్పత్రి స్థాయి పెంచడంతో వైద్యులూ అందుబాటులోకి రానున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బిచ్కుంద ఆస్పత్రి భవనం

14 పడకలతో ప్రారంభమై..

బిచ్కుందలో 1971లో 14 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ భవనంలో అప్పటి మంత్రి అర్జుల రాజారాం ప్రారంభించారు. 2019లో ప్రభుత్వం హెల్త్ కమ్యూనిటీ సెంటర్(సీహెచ్‌సీ)గా మార్చి, 30 పడకలకు పెంచింది. అన్ని హంగులతో పక్కా భవనాన్ని నిర్మించింది. గతేడాది ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆస్పత్రి స్థాయిని పెంచి ఏరియా ఆస్పత్రిగా మార్చింది. ఈ వంద పడకల ఆస్పత్రిలో వైద్యులు, స్టాఫ్‌తోపాటు ఇతర సిబ్బందితో కలిపి 120 పోస్టులు ఉంటాయి. అన్ని రకాల విభాగాలలో కలిపి 11 మంది స్పెషలిస్టు సివిల్ సర్జన్ వైద్యులు, 25 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ వైద్యులు అందుబాటులో ఉండనున్నారు. 26 మంది స్టాఫ్ నర్సులు, ఫిజియోథెరపిస్ట్, ల్యాబ్ టెక్నిషియన్లు, ఆస్పత్రి పర్యవేక్షకులు ప్రజలకు సేవలందించనున్నారు. దీంతో ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగుపడతాయని భావిస్తున్నారు.

క్లుప్తంగా

చెట్లు రోగనిరోధక శక్తిని అభివృద్ధి పరుస్తాయి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ బయోటెక్నాలజీ విభాగంలో గెస్ట్‌లెక్చర్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. యూఎస్ఏ నార్త్‌కరోలినా స్టేట్ యూనివర్సిటీ రీసెర్చ్ సైంటిస్ట్ డాక్టర్ రాజారపు స్వప్నప్రియ 'ఎవల్యూషన్ ఆఫ్ ఫిజియోలాజికల్ మెకానిజం ఇన్ ఇన్సెక్ట్' అనే అంశంపై చర్చించారు. వృక్షాలు తమ రోగ నిరోధకశక్తిని ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకుని కీటకాల నుంచి రక్షించుకుంటాయని వివరించారు. అమెరికాలో ఉన్నత విద్యావకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం స్వప్నను బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీవోస్ చైర్మన్ ప్రవీణ్ మామిడాల, హెచ్‌వోడీ జవేరియా ఉజ్మా, అధ్యాపకులు కిరణ్మయి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు ప్రారంభం

తెయూ(డిచ్‌పల్లి): తెయూ కంప్యూటర్ సైన్స్ కాలేజీలో ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాన్ని రిజిస్ట్రార్ యాదగిరి సందర్శించి పరీక్షల తీరును పరిశీలించారు. పరీక్షలు రాస్తున్న స్కాలర్స్‌కు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని ఇన్విజిలేటర్లకు సూచించారు. దివ్యాంగులు, అంధ విద్యార్థులు ఉంటే వారితో స్క్రైబర్స్‌ను అనుమతించాలని ఆదేశించారు. పరీక్షలకు 135 మందికి హాజరు 132 మంది హాజరు కాగా 3గురు గైర్హాజరైనట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్‌ఆరతి తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నిరసన



తెయూ(డిచ్‌పల్లి): తెయూ యూనివర్సిటీ క్యాంపస్ ప్రధాన కూడలిలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రవీందర్‌నాయక్, మధులిక, నవ్య, మౌనిక, ఆసిఫ్, శ్రీకాంత్, బబ్లు, గంగాధర్, బాబురావు, పాల్గొన్నారు.

ట్రాలీ ఆటోపై కేసు నమోదు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ట్రాలీ ఆటోపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు గురువారం తెలిపారు. మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన నీరడి రమేశ్ తన ట్రాలీ ఆటోలో సుమారు 35మందిని ఎక్కించుకొని తాడ్వాయి మీదుగా కామారెడ్డి వెళ్తున్నట్లు చెప్పారు. అనంతరం ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మంత్రాల నెపం మోపడంతో..

గాంధారి(ఎల్లారెడి): మండలంలోని తిమ్మాపూర్‌లో గ్రామస్తులు ఓ కుటుంబంపై మంత్రాల నెపం మోపడంతో అవమానం భరించలేక ఊరు వదిలి వెళ్లిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలో ఓ మహిళ చేతబడి చేస్తుందని ఆరోపిస్తూ 20 రోజుల క్రితం కొందరు దూషించి పంచాయతీ పెట్టి సదరు కుటుంబాన్ని హెచ్చరించారు. దీంతో వారు అవమానభారంతో ఊరు వదిలి వెళ్లిపోయినట్లు సమాచారం. కొన్ని రోజులు మేడిపల్లిలో ఉన్న బంధువుల ఇంట్లో ఉండి బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లిపోయినట్లు తెలిసింది.

పట్టణాలకు దీటుగా గ్రామాలాభివృద్ధి

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే
- జీపీ, కమ్యూనిటీ భవనాలు ప్రారంభం



బిచ్కుందలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

బిచ్కుంద(జుక్కల్): పట్టణాలకు దీటుగా గ్రామాలలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. గురువారం గోపన్‌పల్లి జీపీ భవనం, కమ్యూనిటీ హాల్, బిచ్కుందలో దళిత కమ్యూనిటీ భవనాలను ప్రారంభించారు. మున్నూర్ కాపు సంఘంలో ఏర్పాటు చేసిన సభలో మహిళలకు బతుకమ్మ చీరలు, 88 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. పథకాలు చూసి ఓటు ద్వారా ఆశీర్వదించాలని కోరారు. అనంతరం యువకులకు కేసీఆర్ క్రీడా కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్, వైస్ ఎంపీపీ రాజు పటేల్, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, సీనియర్ నాయకులు నాల్చర్ రాజు, సొసైటీ చైర్మన్లు బాలు, రాంరెడ్డి, వెంకట్‌రావు, తహసీల్దార్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

హెలీప్యాడ్ పరిశీలన

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రానికి మంజూరైన వంద పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవానికి ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు శుక్రవారం హెలికాప్టర్‌లో బిచ్కుంద వస్తున్నారు. దీంతో గురువారం హెలిప్యాడ్‌ను ఎమ్మెల్యే హన్మంత్ సింధే పరిశీలించారు. హెలిప్యాడ్ నుంచి బైక్ ర్యాలీగా ఆస్పత్రి వరకు వెళ్లనున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఆస్పత్రి ప్రారంభోత్సవం అనంతరం బండాయప్ప ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభకు వెళ్లనున్నారు.

దళిత బంధు అందరికీ ఇవ్వాలి

- మండల పరిషత్ కార్యాలయం ముట్టడి
- 2 గంటలపాటు ప్రజాప్రతినిధులను అడ్డుకున్న దళిత మహిళలు
- ప్రజాప్రతినిధులు, పోలీసుల జోక్యంతో ఆందోళన విరమణ



దళితులను సముదాయిస్తున్న పోలీసులు

దోమకొండ: దోమకొండ మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం దళితులు ముట్టడించి ఆందోళన చేశారు. దళిత బంధు పథకం దళితులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వారు కార్యాలయం ముందు బైఠాయించి నినాదాలు చేశారు. అదే సమయంలో బతుకమ్మ చీరల పంపిణీ కోసం ప్రజాప్రతినిధులు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. కార్యక్రమం ముగించుకుని బయటకు వెళ్తుండగా.. వారిని దళితులు అడ్డుకున్నారు. మండల కేంద్రంలో 200 పైచిలుకు దళిత కుటుంబాలు ఉండగా.. 36 మందికి మాత్రమే దళితబంధు ఇచ్చారని వారు ఆరోపించారు. తమ కుటుంబాలకు కూడా దళిత బంధు ఇస్తామని హామీ ఇచ్చే వరకు కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. రెండు గంటల పాటు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సమదాయించారు. అందరి సమక్షంలో దళిత బంధు మంజూరు లిస్ట్ తొలగిస్తామని రాతపూర్వకంగా హామీలు తీసుకుని ఆందోళన విరమించారు. అనంతరం కామారెడ్డికి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ను కలిసేందుకు వెళ్లారు.

మత్స్య కార్మికులకు జీవనోపాధి



నిజాంసాగర్(జుక్కల్): కులవృత్తులపై ఆధారపడిన వారి కోసం సీఎం కేసీఆర్ పథకాలు అమలు చేస్తూ ఆదుకుంటున్నారని జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు అన్నారు. గురువారం నిజాంసాగర్ ప్రాజెక్టులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో 48 లక్షల చేప పిల్లలు, 48 లక్షల రొయ్య పిల్లలను దఫేదార్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మత్స్యశాఖ ఏడీ వరదారెడ్డి నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, తదితరులున్నారు.

లక్షమందికి డీఎస్ హెల్త్‌కార్డులు

- మాజీ మేయర్ ధర్మపురి సంజయ్

ఖలీల్‌వాడి: లక్ష మందికి డీఎస్ హెల్త్‌కార్డులు అందిస్తామని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ అన్నారు. నగరంలోని ధర్మపురి సంజయ్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన నివాసంలోని కార్యాలయంలో ఆధార్‌కార్డు తీసుకొని వచ్చిన వారికి ప్రతి రోజు హెల్త్‌కార్డులు అందించనున్నట్లు తెలిపారు. ఈ హెల్త్‌కార్డులు నగరంలోని హోప్, ఇండోస్, మెడికవర్, ప్రుడెన్స్, శ్రీకృష్ణ హాస్పిటళ్లలో వర్తిస్తాయని, హాస్పిటల్ ఖర్చుల్లో 30 శాతం రాయితీ ఉంటుందన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్డు అన్ని రకాల రోగాలకు వర్తిస్తుందన్నారు. పేర్లు నమోదు చేయించుకున్న వారికి వెంటనే కార్డును అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆసుపత్రి సిబ్బంది, కాంగ్రెస్ నేతలు సందీప్ సార్థ, వెంకటేశ్వర్‌రావు, బెల్లాల పోతన్న, ప్రమోద్, హకీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



దోమకొండలో..



సంగంలో చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ విఠల్

బతుకమ్మ చీరలను జిల్లాలో పలు చోట్ల మహిళలకు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం బతుకమ్మ చీరలను అందింజేస్తోందని వారు ఈ సందర్భంగా తెలిపారు. అర్హులైన మహిళలందరూ చీరలను తీసుకెళ్లాలని వారు సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



వెల్లుట్లలో ..సర్పంచ్ రాజేశ్వరి



గాంధారి జీపీ కార్యాలయంలో ..

నాణ్యమైన భోజనం అందించాలి

- జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు



నిజామాబాద్‌నాగారం: అంగన్‌వాడీ, పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అధికారులను ఆదేశించారు. విద్య, వైద్యం, ఐసీడీఎస్, పలు శాఖలపై స్టాండింగ్ కమిటీలో గురువారం సమీక్షించారు. పాఠశాలల్లో పిల్లలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సీడీపీవోలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేయాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో నార్మల్ డెలివరీల సంఖ్య పెరిగిందన్నారు. అనంతరం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సమావేశంలో సీఈవో గోవింద్, డీఈవో దుర్గాప్రసాద్, ఆయుష్ జిల్లా అధికారి డాక్టర్ రామ్మోహన్, ఐసీడీఎస్ పీడీ రసూల్‌బీ, జెడ్పీటీసీ సభ్యులు ఎర్రం ముత్యం, షాంబాల్ శంకర్ తదితరులున్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలం ఉమ్మెడ శివారులోని గోదావరి నదిలో షేక్ ఖదీర్(50) అనే వృద్ధుడు పడి మృతి చెందినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన షేక్ ఖదీర్ వృత్తిరీత్యా కూలీ పనిచేస్తుంటాడు. పనిలో భాగంగా మంగళవారం నందిపేట్ మండలంలో పనికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. ఉమ్మెడ శివారులోని గోదావరి నదిలో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టాగా ఖదీర్ మృతదేహంగా గుర్తించారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు నదిలోకి వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెంది ఉంటాడన్నారు. మృతుడి కుమారుడు షేక్ అస్లాం ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కిందపడి ఒకరు..

నవీపేట: యంచ శివారులోని గోదావరి నదికి సమీపంలో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి బుధవారం రాత్రి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్ గురువారం తెలిపారు. మృతుడి వయస్సు 40 సంవత్సరాల వరకు ఉంటాడన్నారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

చెరువులో పడి వృద్ధురాలు..



ఎంకవ్వ మృతదేహం

భిక్కనూరు: మండల కేంద్రంలోని బొబ్బిలి చెరువులో ప్రమాదవశాత్తు పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఎంకవ్వ(68) రెండు సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతోంది. గురువారం ఉదయం ఆసుపత్రికి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. గ్రామ చెరువులో మృతిచెందినట్లు కుటుంబీకులు గుర్తించారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి చెరువులో పడి మృతి చెందినట్లు కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి కుమారుడు సిద్ధిరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరు..

దోమకొండ: మండలంలోని సీతారాంపల్లి గ్రామానికి చెందిన పుట్ట రాములు(62) అనారోగ్యంతో బాధపడుతూ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బీబీపేట ఎస్సై సాయిరెడ్డి గురువారం తెలిపారు. కొంతకాలంగా కడుపులో కణితితో బాధపడుతున్న రాములు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, నలుగురు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడిని కాపాడిన యువకులు

నవీపేట: యంచ గోదావరి నదిలో దూకి గురువారం ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడిని యంచ యువకులు కాపాడారు. ఇందల్వాయి మండలానికి చెందిన గంగారాం కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు యత్నించాడు. ఆత్మహత్య చేసుకునేందుకు బ్రిడ్జిపై నుంచి యత్నించగా అటువైపుగా వెళ్తున్న యంచ యువకులు అప్రమత్తమై కాపాడారు. అనంతరం కుటుంబ సభ్యులకు విషయాన్ని వెల్లడించగా వారు వృద్ధుడిని తీసుకెళ్లారు. యువకులను గ్రామస్తులు అభినందించారు.

బాన్సువాడలో చోరీ

బాన్సువాడ/ బాన్సువాడ రూరల్: పట్టణంలోని పాత బాన్సువాడకు చెందిన బోడ విక్రమ్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డిల ఇంట్లో దుండగులు బీరువాలను పగులగొట్టి రూ. 4 లక్షల నగదును అపహరించినట్లు సీఐ మహేందర్ రెడ్డి గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బేతాళస్వామి ఆలయం వద్ద నివాసముంటున్న బోడ విక్రమ్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డిల ఇళ్లల్లో మురళీ అనే వ్యక్తి గుమస్తాగా పని చేస్తున్నాడు. బుధవారం పనిముగించుకొని గుమాస్తా ఇంటికి తాళం వేసి వాచ్‌మన్‌కు అందించాడు. రాత్రి దొంగతనం జరిగినట్లు గుర్తించి యజమానులకు మురళీ సమాచారం అందించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళలపై దాడుల నివారణలో ప్రభుత్వాలు విఫలం



డిచ్‌పల్లి: మహిళలపై నిత్యం జరుగుతున్న దాడులను నివారించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని తెయూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.సరిత అన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మండలంలోని ఓ ప్రైవేటు కళాశాలలో 'అమ్మాయిలపై దాడులు– పోరాటాలు' అనే అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. మద్యం అమ్మకాలు పెంచుతూ ప్రభుత్వాలు యువతను పక్కదారి పట్టిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జన్నారపు రాజేశ్వర్, దేవిక, వి.సంతోష్, శివసాయి, రవీందర్, అక్షయ్ పాల్గొన్నారు.

నాటుసారా పట్టివేత

సిరికొండ: మండలంలోని దుప్య తండాలో నాటు సారా తయారు చేస్తుండగా ఇద్దరిని పట్టుకున్నట్లు భీంగల్ ఎక్సైజ్ సీఐ వేణుమాధవ్‌రావు గురువారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు తండాలో దాడులు నిర్వహించగా తండాకు చెందిన స్రవంతి, రంకు నాటు సారా తయారు చేస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిని తహసీల్దార్ రవీందర్‌రావు ఎదుట బైండోవర్ చేసినట్లు చెప్పారు. దాడిలో సిబ్బంది ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్ ఇస్తున్న ప్రభుత్వం మాది

- స్పీకర్ పోచారం పోచారం శ్రీనివాస్ రెడ్డి



సీఎండీ ప్రభాకర్ రావుతో కలిసి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్

బాన్సువాడ రూరల్: రైతులకు నాణ్యమైన 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం మాదేనని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కొల్లూర్‌లో రూ.98 కోట్ల నిధులతో నిర్మించిన 220/132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు, వరంగల్ సీఎండీ గోపాల్‌రావు, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. నేడు ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ రాష్ట్రాన్ని 15 ఏళ్లు సీఎంగా పాలించినా నేటికి అక్కడ కరెంటుకు దిక్కులేదన్నారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో ఆలోచించడం, సీఎండీగా ప్రభాకర్ రావు డిస్ట్రిబ్యూషన్, ట్రాన్స్‌మిషన్, జనరేషన్‌లో తీసుకున్న విప్లవాత్మక చర్యల మూలంగా తెలంగాణలో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన సమయంలో మనకు 7,780 మెగావాట్ల విద్యుత్ వస్తే దాన్ని నేడు 20 వేల మెగావాట్లకు తీసుకెళ్లిన ఘనత సీఎం కేసీఆర్, సీఎండీ ప్రభాకర్‌రావులకే దక్కుతుందన్నారు. కొల్లూర్‌లో నిర్మించిన సబ్‌స్టేషన్‌తో ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలకు విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి చెక్కులు, బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్‌కిట్‌లను పంపిణీ చేశారు. నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, ఎంపీపీ నీరజా వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ పద్మాగోపాల్‌రెడ్డి, సర్పంచ్ తుకారాం, నాయకులు ద్రోణవల్లి సతీష్, అంజిరెడ్డి, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

తలసరి వినియోగంలో టాప్

తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు అన్నారు. రాష్ట్ర తలసరి విద్యుత్ వినియోగం 2,140యూనిట్లు అయితే దేశం సరాసరి విద్యుత్ తలసరి వినియోగం 1255 యూనిట్లు మాత్రమేనని తెలిపారు. వరంగల్ సీఎండీ గోపాల్‌రావు, ఎస్ఈ సూర్య నర్సింహారావు, తదితరులు ఉన్నారు.

పట్టు పట్టి పోలీసు ఉద్యోగాలు కొట్టి..



దాసరి రాజు, బాన్సువాడ



సామల సృజన, ధర్మారావ్‌పేట్



దాసరి అరవింద్‌రెడ్డి, తాడ్వాయి



దుంపల అజయ్, ఎల్లారెడ్డి



మాలోత్ రజిత, లింగంపేట

పోలీసు ఉద్యోగం కోసం నెలల తరబడి కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకొని కష్టపడి చదివారు. చివరకు ఉద్యోగం సాధించారు. ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్ పరీక్షా ఫలితాల్లో జిల్లాకు చెందిన యువతీ యువకుల పేర్లు ఉండటంతో వారి కుటుంబాల్లో దసరా పండుగ ముందే వచ్చింది. సదాశివనగర్ మండలం నుంచి 11 మంది, ఎల్లారెడ్డి నుంచి ఐదుగురు, లింగంపేట మండలం మాలోత్ తండా నుంచి ఇద్దరు, బాన్సువాడ నుంచి ముగ్గురు, తాడ్వాయి నుంచి 13 మంది పోలీసు ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

–సాక్షి నెట్‌వర్క్

ఒకే ఇంట్లో ముగ్గురికి కానిస్టేబుల్ ఉద్యోగాలు



ఉద్యోగానికి ఎంపికైన ముగ్గురు అన్నదమ్ములు

మద్నూర్(జుక్కల్): శేఖాపూర్ గ్రామానికి చెందిన సక్వాల్ సురేష్, అనితలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని వీరికి సతీష్, సచిన్, నితిన్ అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరు ముగ్గురు చిన్నప్పటి నుంచి కష్టపడి చదువుకుని ముగ్గురూ ఒకేసారి పోలీస్ ఉద్యోగం సంపాదించడంతో గురువారం గ్రామంలో సర్పంచ్ ఎంకే పటేల్, గ్రామస్తులు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

మూడు ఉద్యోగాలు ఒకేసారి సాధించి



నర్సగోని అనిల్‌గౌడ్

బీబీపేట: నిరుపేద కుటుంబంలో పుట్టి పెరిగి ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకొని కష్టపడి చదివి ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించి మండల ప్రజల మన్ననలు పొందాడు నర్సగోని అనిల్ గౌడ్. వివరాలు.. ఉప్పర్‌పల్లి గ్రామానికి చెందిన నర్సగోని అనిల్‌గౌడ్ రెండు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు రాష్ట్ర పోలీసు శాఖలో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. సంవత్సర కాలంగా నిజామాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ తీసుకుంటూ ఆగస్టులో స్టాఫ్ సెలక్షన్ కమీషన్ జనరల్ డ్యూటీ అస్సాం రైఫిల్స్‌లో మొదటి ఉద్యోగం సాధించాడు. ఈ ఉద్యోగానికి ఈ నెలలో జాయిన్ కావల్సి ఉంది. పదిహేను రోజుల క్రితం బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్(ముంబై)లో అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా రెండో ఉద్యోగం సాధించాడు. దీనికి కూడా ఇదే నెలలో జాయిన్ కావాల్సి ఉండగా గురువారం విడుదలైన పోలీసు ఫలితాల్లో సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

నాడు అన్న..నేడు తమ్ముడు



రమావత్ ఆనంద్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మెల్లకుంటతండాకు చెందిన రమావత్ దేవిసింగ్, సామిని దంపతుల కుమారుడు రమావత్ ఆనంద్ బెటాలియన్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. కాగా అతని సోదరుడు రాజేశ్ సైతం 2018లో బెటాలియన్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. అన్నను ఆదర్శంగా తీసుకొని ఆనంద్ సైతం కష్టపడి చదివి ప్రస్తుతం కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఆనంద్‌ను ఈ సందర్భంగా తండాలోని పలువురు అభినందించారు.

హాస్టల్ సమస్యలను పరిష్కరించాలి

- అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి
- రిజిస్ట్రార్ యాదగిరి



విద్యార్థులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్

తెయూ(డిచ్‌పల్లి): తెయూ బాలుర, బాలికల హాస్టళ్లలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రిజిస్ట్రార్ ఎం.యాదగిరి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం మెయిన్ క్యాంపస్‌లోని న్యూ బాయ్స్ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్స్‌లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని చీఫ్ వార్డెన్ మహేందర్‌రెడ్డిని, విద్యుత్ సమస్య లేకుండా చూడాలని ఎలక్ట్రిషియన్‌ను, హాస్టల్స్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఎస్టేట్ ఆఫీసర్‌ను, సెక్యూరిటీ గార్డ్స్ 24 గంటలు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని, కాంపిటేటివ్ పరీక్షలకు సంబంధించి అన్ని పుస్తకాలను కొనుగోలు చేయాలని లైబ్రేరియన్ సత్యనారాయణను ఆదేశించారు. విద్యార్థులు పోటీ పరీక్షలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని రిజిస్ట్రార్‌కు అందజేశారు. రిజిస్ట్రార్ వెంట ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, వైస్‌ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ, పీఆర్‌వో పున్నయ్య, హాస్టల్స్ కేర్‌టేకర్స్ క్రాంతికుమార్, దిగంబర్ చౌహాన్, సిబ్బంది ఉన్నారు.

వైకుంఠధామాల తాళాలు తెరవాలి



అర్సపల్లి వైకుంఠధామం ముందు ధర్నా చేస్తున్న బీజేపీ నేత ధన్‌పాల్ సూర్యనారాయణ, స్థానికులు

ఖలీల్‌వాడి: నగరంలోని వైకుంఠధామాలను ఇటీవల మంత్రి కేటీఆర్‌తో హడావుడిగా ప్రారంభించి, తాళాలు వేయడం సరైనది కాదని, వెంటనే వాటిని తెరవాలని బీజేపీ నేత ధన్‌పాల్ సూర్యనారయణ గుప్తా డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆయన 14, 15వ డివిజన్‌లకు చెందిన ప్రజలతో కలిసి అర్సపల్లిలోని వైకుంఠధామం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వైకుంఠధామాలకు తాళం వేసి ఉంచడంతో దహన సంస్కరణలు ఎక్కడ చేయాలని ప్రశ్నించారు. వెంటనే వైకుంఠధామాలు తెరిచి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. లేకపోతే అన్ని వైకుంఠధామాల ముందు బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. నగరంలో ఎమ్మెల్యే అవినీతి మీద శ్రద్ధ పెట్టినట్లు ఆరోపించారు. కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించకపోవడంతోనే వైకుంఠధామాలకు తాళాలు వేసినట్లు ఆరోపించారు. అర్బన్ ఎమ్మెల్యే దత్తత తీసుకున్న డివిజన్‌లో పరిస్థితి దారుణంగా ఉందని, కులసంఘాలకు ప్రొసీడింగ్‌లు ఇవ్వడం కాదని, వారికి కావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు రావడంతో కులసంఘాల వద్దకు ఎమ్మెల్యే వస్తున్నట్లు ఆరోపించారు. నాయకులు ఆర్మీ రమేష్, రంజిత్, నాగోల్ల లక్ష్మీనారాయణ, పవన్, ముందడ ఆశిష్, పల్నాటి కార్తీక్, కార్పొరేటర్లు మెట్టు విజయ్, ఎర్రం సుధీర్, పంచ రెడ్డి శ్రీధర్, గోపిడి వినోద్‌రెడ్డి, ప్రభాకర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.